www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 5 ఏప్రిల్ 2025
5
ఏలూరు



బాలుర వసతి గృహం సందర్శన


పరిశీలిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు అర్బన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ శుక్రవారం స్థానిక శనివారపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లాలోని వసతి గృహాలను ప్రతినెల తనిఖీ చేయాలని, అందులో భాగంగా ఈరోజు ఈ ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించి, బాలురకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, వైద్య, విద్యా సదుపాయాలపై వివరాలు తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవల్లి, డిపిఒ మోహనరావు, న్యాయవాదులు టి.వెంకటేశ్వరరావు, భాస్కర్ పాల్గొన్నారు.

పింఛన్.. టెన్షన్..!

వికలాంగుల పింఛన్ల వెరిఫికేషన్ వేగవంతం
రెవెన్యూ డివిజన్ పరిధిలో పింఛన్‌దారులంతా ఒకచోటుకు
ఏలూరు సర్వజన ఆసుపత్రి వద్ద కిటకిట
దూరం నుంచి రాలేక వికలాంగుల అవస్థలు
రెండు జిల్లాల్లో దాదాపు 60 వేల మంది లబ్ధిదారులు


ఏలూరు సర్వజన ఆసుపత్రి వద్ద వచ్చిన వికలాంగ పింఛన్ దారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వికలాంగుల పింఛన్‌దారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పింఛన్ ఉంటుందా.. కారణాలు బూచిగా చూపి తొలగిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ప్రభుత్వం వికలాంగుల పింఛన్లకు సంబంధించి వెరిఫికేషన్ వేగవంతంగా సాగిస్తోంది. ఏలూరు జిల్లాలో మొత్తం 2,60,195 సామాజిక పింఛన్ల పంపిణీ జరుగుతుండగా ఇందులో దాదాపు 33 వేల వరకూ వికలాంగుల పింఛన్లు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 2,25,718 పింఛన్లు ఉండగా వికలాంగుల పింఛన్లు 27 వేలు వరకూ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వికలాంగుల పింఛన్లలో అనర్హులు ఉన్నారంటూ వెరిఫికేషన్‌కు శ్రీకారం చుట్టింది. ముందుగా మంచానికే పరిమితమైన రూ.15 వేలు పింఛన్ అందుకుంటున్న వారిని వెరిఫికేషన్ చేసింది. ఆ ప్రక్రియ పూర్తయ్యింది. వెరిఫికేషన్ జాబితాను మాత్రం బహిరంగపర్చలేదు. ఇప్పుడు నెలకు రూ.ఆరువేలు పింఛన్ అందుకుంటున్న వికలాంగుల పింఛన్లను వెరిఫికేషన్ చేస్తోంది. బుధ, గురు, శుక్రవారాల్లో వెరిఫికేషన్ ప్రక్రియ సాగింది. ఇంకా చేయాల్సి ఉంది. రెవెన్యూ డివిజన్ పరిధిలోని వికలాంగులను ఒకచోటుకు రప్పించి ఈ వెరిఫికేషన్ ప్రక్రియ సాగిస్తున్నారు. ఏలూరు డివిజన్ పరిధిలో పింఛన్ అందుకుంటున్న వికలాంగులందరినీ ఏలూరు సర్వజన ఆసుపత్రికి రప్పిస్తున్నారు. ఎముకలకు సంబంధించిన వికలాంగులకు భీమడోలు, కైకలూరులోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ చేస్తున్నారు. చెవి, మానసిక, ఇతర సమస్యలు ఉన్న వికలాంగులంతా ఏలూరు సర్వజన ఆసుపత్రికి రావాల్సిందే. ఒకపక్క వేసవి ఎండలు, మరోపక్క దూర ప్రయాణంతో వికలాంగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. డిఆర్‌డిఎ సిబ్బంది ఆసుపత్రి వద్ద టెంట్లు వేసుకుని ఈ ప్రక్రియను సాగిస్తున్నారు. వెరిఫికేషన్‌కు వచ్చిన వికలాంగులంతా గంటల తరబడి వేచి ఉండలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు వంటి వసతులు సైతం సరిగా ఏర్పాటు చేయలేదు. వికలాంగుల పింఛన్ వెరిఫికేషన్ ప్రక్రియ సక్రమంగా సాగుతుందా అనే అనుమానాలు అందరిలోనూ నెలకొన్నాయి.

పింఛన్ల లబ్ధిదారులను తగ్గించే ఎత్తుగడ అంటూ విమర్శలు

కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే రూ.మూడు వేలు పింఛన్ రూ.నాలుగు వేలు చేస్తామని, వికలాంగులకు రూ.మూడు వేల నుంచి రూ.ఆరు వేలు ఇస్తామని ప్రకటించింది. గెలిచిన తర్వాత అనుకున్నట్లు పింఛన్ పంపిణీ ప్రారంభించింది. అయితే పింఛన్ల భారం పెరగడంతో తగ్గించుకునే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ముందుగా వికలాంగుల పింఛన్ల వెరిఫికేషన్ ప్రారంభించిందనే చర్చ సాగుతోంది. గతంలో ఇదే అధికారులు ఉన్నారు. అప్పుడు పింఛన్ మంజూరు చేసిన డిఆర్‌డిఎ అధికారులే ఇప్పుడు మళ్లీ వెరిఫికేషన్ ప్రక్రియలో పాల్గొంటున్నారు. అనర్హులు ఉంటే తొలగించడం తప్పుకాదు. అందుకోసం పింఛన్ అందుకుంటున్న వికలాంగులందరినీ ఇబ్బంది పెట్టడం ఏవిధంగా సమంజసమో అర్థం కావడం లేదు. పింఛన్లు తగ్గించుకునేందుకు అంగవైకల్యం శాతం తక్కువగా చూపించి తొలగిస్తారేమోననే భయం వికలాంగులను వెంటాడుతోంది. అనర్హుల వ్యవహారం సాకుగా చూపి కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కొత్త పింఛన్లను మంజూరు చేయకుండా నిలిపివేసింది. దీంతో ఎంతోమంది పింఛన్ల కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి


జంగారెడ్డిగూడెంలో..

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన జంగారెడ్డిగూడెంలో శుక్రవారం నిరసన తెలిపారు. రాజ్యాంగ హక్కులు కాపాడాలని, మైనార్టీలను రెండో తరగతి పౌరులుగా మార్చొద్దని కోరుతూ స్థానిక బిలాల్ మసీదు, చిన్న మసీదు ప్రాంతంలో సిపిఎం ఆధ్వర్యాన కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ముస్లింలతో కలిసి ఆయా ప్రాంతాల్లో కొద్దిసేపు కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, పట్టణ నాయకులు వి.గోపి తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని పలువురు ముస్లిం పెద్దలు డిమాండ్ చేశారు. మాజీ ఎంఎల్ఎ ప్రతాప్ అప్పారావు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో హుస్సేన్ గబ్బర్ తదితరులు మాట్లాడారు. ఇఫ్తార్ విందులో చంద్రబాబు మైనార్టీలకు వ్యతిరేకంగా ఎటువంటి చట్టాలకు మద్దతు పలకబోమని హామీ ఇచ్చి నేడు పార్లమెంటులో వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు పలుకడం దారుణమన్నారు. వక్ఫ్ భూములను దోచుకునేందుకే ఈ సవరణ బిల్లును తీసుకొచ్చారని విమర్శించారు.

అకాల వర్షం.. అన్నదాతకు కష్టం


పందిళ్లపై బరకాలు కప్పిన రైతులు

ప్రజాశక్తి - ముసునూరు

రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల మండలంలోని రైతులు దిగాలు పడ్డారు. పలు గ్రామాల్లో పొగాకు, మొక్కజొన్న, మిర్చి పంట చేతికొచ్చే దశలో ఉంది. ఈ క్రమంలో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షం రైతులకు అశనిపాతంలా మారింది. ముసునూరు, గోపవరం, పెద్దపాటి వారిగూడెం, బలివే, గుళ్లపూడి, కాట్రేనిపాడు గ్రామాల్లో సాగు చేసిన పొగాకు పంట పందిళ్లపై ఉంది. ఇంకొక 20 రోజుల్లో పంట చేతికొచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో కురిసిన వర్షంతో పంట తడిసి ముద్దయ్యింది. దీంతో పొగాకు రంగు మారి కొనుగోలుదారులు సగం ధరకే కొనుగోలు చేసే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసి ముద్దయిపోవటంతో సగం ధరకే కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని వాపోతున్నారు. ఇప్పటి వరకూ దుక్కులు మొదలు నారుమళ్లు, పొగాకు మొక్క నాటడం, ఎరువులు, క్రిమిసంహారక మందులు, కూలీల ఖర్చు, ఇలా సుమారు ఎకరానికి రూ.లక్ష నుండి రూ.లక్షా 50 వేల వరూ పెట్టుబడి ఖర్చులయినట్లు ఒక అంచనా. కనీసం ఖర్చులు కూడా రాని ప్రమాదం ఉందని, ఇప్పటికే ధర తక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. మిర్చి కోత కోసి కల్లాల్లో ఆరబెట్టి అమ్మకానికి సిద్ధం చేసే సమయంలో ఇలా అకాల వర్షాలు ముంచెత్తాయి. మిర్చి కూడా రంగు మారి ధర తగ్గే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అకాల వర్షాల వల్ల నష్టాన్ని అంచనా ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఫార్మా విద్యార్థిని నాగాంజలి మృతితో..

రోదించిన రౌతుగూడెం

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, దీపక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా, ప్రజాసంఘాల ఆందోళన


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


ఆందోళనకారులను సముదాయిస్తున్న పోలీసు అధికారులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రాజమండ్రి కిమ్స్ ఆసుపత్రి ఉద్యోగి వేధింపులు తాళలేక ఆ ఆసుపత్రిలో ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఫార్మా విద్యార్థిని నల్లపు నాగాంజలి (23) పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందడంతో ఆమె స్వగ్రామమైన మండలంలోని రౌతుగూడెంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి సమీపంలో మధురపూడిలో నున్న ఫార్మసీ కళాశాలలో చదువుతోంది. రాజమహేంద్రవరం కిమ్స్‌లో ఫార్మాసిస్ట్‌గా ఇంటర్న్‌షిప్ చేస్తోంది. ఈ సమయంలో కిమ్స్ ఉద్యోగి దీపక్ ఆమెను పెళ్లి పేర వంచించి, లైంగికంగా వేధించాడు. ఆ వేధింపులు తాళలేక మార్చి 23న విబి 10ఎంజి ఇంజెక్షన్ తీసుకుని నాగాంజలి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నాటి నుంచి అపస్మారక స్థితిలో ఉన్న ఆమె అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీనిపై ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, ప్రజా సంఘాల ఆందోళనతో కదిలిన పోలీసులు నాగాంజలి సూసైడ్ నోట్ ఆధారంగా దీపక్‌ను గత వారంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. నాటి నుంచి మృత్యువుతో పోరాడుతున్న ఆమె శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచింది. దీంతో మృతదేహాన్ని రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అక్కడి నుంచి పోలీసు బందోబస్తు నడుమ రౌతుగూడెం తరలించారు. నాగాంజలి తల్లిదండ్రులు నల్లపు దుర్గారావు, అనంతలక్ష్మి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుంటారు. పెళ్లయిన 13 సంవత్సరాల తర్వాత పుట్టిన ఏకైక సంతానం అంజలి మృతితో ఆ కుటుంబం తల్లడిల్లుతున్న తీరు అందరినీ కలిచివేసింది. ఈ సందర్భంగా నాగాంజలి కుటుంబాన్ని ఆదుకోవాలని, కారకుడైన దీపక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా, ప్రజాసంఘాల నేతలు నినదించారు. పోలీసులు వారికి సర్దిచెప్పి అంత్యక్రియలు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, నేత ఎన్.నిర్మల, సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు తదితరులు నాగాంజలి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.


మీడియాతో మాట్లాడుతున్న శ్యామలారాణి

అంజలి ఆత్మహత్యకు కారకులను కఠినంగా శిక్షించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాజమండ్రి బొల్లినేని ఆసుపత్రి ఫార్మాసిస్టు ఎస్.అంజలి ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అంజలి ఆత్మహత్యయత్నానికి పాల్పడి వారం రోజులపాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం మృతి చెందడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. అంజలి మృతి పట్ల సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంజలి ఆత్మహత్యపై పోలీస్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. నిందితుడిని అరెస్టు చేయడానికి ప్రజలు ఉద్యమించాల్సి వచ్చిందని, ఈ తరుణంలో నిందితుడి పట్ల సానుకూలంగా వ్యవహరించే ప్రమాదం ఉందని ప్రజలు అనుమానిస్తున్నారని, ఆ అనుమానాలను నివృత్తి చేసేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొత్త సూపర్ లగ్జరీ బస్సులు ప్రారంభం


బస్సులు ప్రారంభిస్తున్న రెడ్డి అప్పలనాయుడు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రెండు కొత్త సూపర్ లగ్జరీ బస్సులను ఎపిఎస్‌ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ప్రారంభించారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో ఈ బస్సులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమైన అన్ని రూట్లలో సౌకర్యవంతమైన బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు అతి త్వరలో ఉచిత ప్రయాణ సౌకర్యం లభిస్తుందన్నారు. నూజివీడు నుండి రాత్రి 7:30 గంటలకు తిరుపతికి బయలుదేరి మరుసటి రోజు ఉదయానికి చేరుకుంటుందన్నారు. తిరుపతి నుండి మరుసటి రోజు సాయంత్రం 6:10 గంటలకు బయలుదేరి నూజివీడు ఆ మరుసటి రోజు ఉదయానికి తిరిగి వస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, ఆర్‌టిసి అసిస్టెంట్ మేనేజర్ రాంబాబు, అద్దె బస్సు యజమానుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.రామకృష్ణ, అద్దె బస్సు యజమాని పుట్టి శరత్ బాబు, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.


రిజిస్ట్రేషన్లకు ముందస్తు స్లాట్ బుకింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రిజిస్ట్రేషన్లకు ముందస్తు అపాయింట్‌మెంట్ పొందడం వల్ల క్రయ విక్రయదారులకు నిరీక్షణ సమయం తగ్గుతుందని ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం నుంచి స్లాట్ బుకింగ్ విధానం ప్రారంభమైందన్నారు. తొలి విడతలో 26 జిల్లాల్లోని ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి వచ్చిందని, మిగిలిన కార్యాలయాల్లో ఈ నెలాఖరులోగా దశలవారీగా ప్రారంభమవుతుందని వివరించారు. స్లాట్ బుక్ చేసుకోదల్చినవారు పబ్లిక్ డేటా ఎంట్రీ సిస్టమ్ ద్వారా registration.Ap.gov.in అధికారిక వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రిజిస్ట్రేషన్ కొనసాగుతుందని తెలిపారు. ఉదయం నుంచి రెండు రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిపారు. ముందుగా చలానా కట్టి అనంతరం స్లాట్ బుకింగ్ చేసుకోవాలని ప్రజలకు సూచించారు. దీనివల్ల ప్రజలు క్యూలైన్లో వేచి ఉండే అవసరం ఉండదని, వారి అపాయింట్‌మెంట్ సమయానికి రావొచ్చని సూచించారు. స్లాట్ ఆధారిత అపాయింట్‌మెంట్ల ద్వారా అనధికారిక కార్యకలాపాలు తగ్గుతాయని తెలిపారు.

గిరిజనులకు అన్యాయం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్


డిప్యూటీ తహశీల్దార్ పాయం రమేష్‌కు వినతిని అందజేస్తున్న కెవిపిఎస్ నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పూర్వపరాలు పరిశీలించకుండా భూస్వాములకు తప్పుడు పద్ధతిలో స్పెషల్ డిప్యూటీ ట్రైబల్ కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌ని సమగ్ర దర్యాప్తు జరిపించి తప్పుడు ఆర్డర్లు ఇచ్చిన కెఆర్ పురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ పాయం రమేష్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ మండలంలోని జగిశెట్టిగూడెం గ్రామంలో గిరిజనులు 36 ఎకరాలు సాగు చేసుకుంటున్న రెవెన్యూ పరిధిలో 33 ఆర్‌ఎస్‌ఆర్ దాఖల మూడు తరాల జి రాయితి భూములు కెఆర్ పురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ట్రైబల్‌కి వ్యతిరేకంగా నాన్ ట్రైబల్, భూస్వామికి అక్రమ పద్ధతిలో ఆర్డర్ ఇవ్వడం జరిగిందన్నారు. ట్రైబల్ భూమిని తప్పుడు ఆర్డర్లతో ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో పెట్టి కోట్ల రూపాయలు ఏజెన్సీలోని ప్రాంతాల్లో అక్రమంగా సంపాదించే దానికి అధికారులు అలవాటు పడి గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని, 1/70 చట్టాన్ని నీరుగారుస్తున్నారని ఫ్రాన్సిస్ విమర్శించారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఐటిడిఎ ఉందని ప్రభుత్వాలు చెబుతున్నాయి కానీ ఇక్కడ జరిగేదంతా గిరిజనేతరులకి అనుకూలంగా తీర్పులిస్తున్నారని, ఐటిడిఎ పరిధిలో గిరిజన సంక్షేమం కోసం ఏర్పడిన ట్రైకర్ ఛైర్మన్ ఉన్న గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఫ్రాన్సిస్ అన్నారు. ఇప్పటికైనా ఐటిడిఎ పిఒ, ట్రైకర్ ఛైర్మన్ కలగజేసుకొని గిరిజనులకు న్యాయం చేయాలని గిరిజన, దళిత ప్రజాసంఘాలు కోరుకుంటున్నాయి. ఇప్పటికైనా తప్పుడు ఆర్డర్లతో గిరిజనులను మోసం చేస్తున్న అధికారులపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, ఐటిడిఎ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌పై సమగ్ర దర్యాప్తు జరిపించి వాస్తవాలను బయటకు తీయాలని, లేనిపక్షంలో గిరిజన, దళిత ప్రజాసంఘాలను ఐక్యంచేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాధిత గిరిజనులు సూర్యచంద్రం, బాబురావు, రామారావు, నాగార్జున పాల్గొన్నారు.

తారు రోడ్డు పనుల నాణ్యతపై రైతుల్లో ఆందోళన

మార్జిన్‌లో నల్లమట్టిపై అనుమానాలు


తల్లాపురం-చేబ్రోలు తారు రోడ్డు నిర్మాణ పనుల మార్జిన్‌లో నల్లమట్టి

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు నుంచి తల్లాపురం వరకు సుమారు 3.5 కి.మీ. పొడవైన తారురోడ్డు నిర్మాణ పనుల నాణ్యతపై పలువురు రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతమున్న తారు రోడ్డు పూర్తిగా శిథిలమై తన ఉనికిని కోల్పోయింది. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వం రూ.1.29 కోట్ల ఉపాధి హామీ నిధులు ఈ రోడ్డుకు కేటాయించింది. ఈక్రమంలో తొలివిడతగా రూ.79 లక్షలు విడుదల చేయడంతో కొంత దూరం వరకూ పనులు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. అయితే రోడ్డు అంచుల వెంబడి కొన్నిచోట్ల స్థానికంగా లభించే పంట, మురుగు బోదెల వెంబడి నల్లమట్టిని జెసిబి సాయంతో తవ్వి మార్జిన్‌గా వేయడం పట్ల రైతులు నాణ్యతపై అనుమానం వ్యక్తం చేస్తూ మీడియాకు వెల్లడించారు. దీనిపై పిఆర్ఎఇ కృష్ణమోహన్ మాట్లాడుతూ వర్క్ ఎస్టిమేషన్‌లో ఎక్కడా కంకర వేయాలని నిబంధనలు లేవని గోతులు, పల్లంగా ఉన్న చోట్ల స్థానికంగా ఉన్న నల్లమట్టిని వేసి దానిపై రోలర్ సాయంతో పటిష్టంగా రోలింగ్ చేయిస్తామన్నారు. నాణ్యతకు పెద్ద పీట వేస్తున్నామని ఎలాంటి అందోళన, అనుమానాలకు తావులేకుండా రోడ్డు నిర్మాణం పూర్తిచేయిస్తానన్నారు. తనకు ఫోన్ చేసిన రైతులకు కూడా ఇదే విషయాన్ని వివరించానన్నారు.

స్మార్ట్ మీటర్లను బిగించొద్దు

సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యాన ధర్నా



కరెంటు ఎఇకు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - బుట్టాయిగూడెం

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించొద్దు, అదనపు చార్జీల పేరుతో పేదలపై భారాలు పెట్టొద్దు, ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్లు ఉచిత కరెంటు పథకాన్ని అమలు చేయాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యాన నినదించారు. శుక్రవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కరెంట్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు చార్జీల పెంపులో భాగంగా స్మార్ట్ మీటర్లు బిగింపు చేస్తున్నాయని, తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు. అనంతరం కరెంటు ఎఇకి వినతి పత్రం అందజేశారు. బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ చలపతిరావుకి వినతిపత్రం అందించారు. బుట్టాయగూడెంలో గిరిజనుల ఇళ్ల స్థలాలు తక్షణమే సర్వే చేసి ప్రభుత్వ భూమి ఎంత ఉందో తేల్చాలని అన్నారు. గిరిజనులు వేసుకున్న ఇళ్లకి మంచినీటి, కరెంటు సౌకర్యాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఇనుమూరు, మర్లగూడెం, జైనువారగూడెం గ్రామాల్లో ఉన్న భూ సమస్యలు పరిష్కారం చేయుటకు తక్షణమే భూ రికార్డు పరిశీలించి గిరిజనులకు న్యాయం చేయాలని వారు కోరారు. లేని పక్షంలో అందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పోలోజు నాగేశ్వరావు, తామ ముత్యాలమ్మ, కుర్సం భీమరాజు, చంద్రు బుల్లమ్మ, మడకం శ్రీదేవి, కొమరం సత్యనారాయణ, సోయం శ్రీనివాసు, మడివి రాము ఉన్నారు.

హెచ్‌సియు భూములను కాపాడాలని విద్యార్థుల నిరసన

నూజివీడుటౌన్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సియు)లో గతవారం రోజుల నుంచి విద్యార్థులు, అక్కడున్నటువంటి విద్యార్థి సంఘాలు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా ఐసా ఆధ్వర్యంలో శుక్రవారం నూజివీడు కృష్ణ యూనివర్సిటీ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసా జిల్లా కార్యదర్శి అఖిల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని అక్రమంగా ప్రయివేట్, కార్పొరేట్ వ్యక్తులకు లాభపరిచే విధంగా చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే విద్యార్థులు చేస్తున్న ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం యూనివర్సిటీ భూమిని యూనివర్సిటీకే చెందే విధంగా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని అన్ని ప్రాంతాల్లో విస్తరింపజేసి, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసా నాయకులు రియాజ్ శీను, గణేష్, రాజేశ్వరి, సౌజన్య, చంద్రలేఖ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కృష్ణా యూనివర్శిటీ విద్యార్థులు

సాగర్ జలాల పరిశీలన

ఆగిరిపల్లి: నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్‌కు తెలంగాణా ప్రభుత్వం సాగర్ జలాలను పూర్తిస్థాయిలో విడుదల చేసిన నేపథ్యంలో శుక్రవారం నూజివీడు బ్రాంచి కాలువ ఈదర 26.988 కిలోమీటర్ రెగ్యులేటర్ వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాలువను ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, సాగునీటి సంఘాల సారధులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ఎన్ఎస్‌పి డిఇఇ కె.సీతారావమ్మ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌లు కొల్లి శ్రీనివాసరెడ్డి(రెడ్డిగూడెం), పామర్తి శ్రీనివాసరావు(నున్న), దేవినేని సత్యనారాయణ(మడిచర్ల), రాపర్ల బాలకృష్ణ(ముసునూరు), ఆయకట్టుదారులు దాసరి తిరుపతిరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రూ.864 కోట్ల ధాన్యం బకాయిల విడుదలకు ఎంఎల్ఏ చింతమనేని కృషి

జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాషా వెల్లడి

ప్రజాశక్తి - దెందులూరు

రాష్ట్రంలోని రైతుల కోసం రూ.864 కోట్ల ధాన్యం బకాయిల విడుదలలో దెందులూరు ఎంఎల్ఏ చింతమనేని ప్రభాకర్ ఎంతో చొరవ చుపారని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాషా తెలిపారు. పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో రబి సీజన్లో జిల్లాలోనే తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దెందులూరు ఎంఎల్ఏ చింతమనేని ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్ఏ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని విధాల రైతుల సంక్షేమానికి అండగా ఉంటుందని, రబీ సీజన్లో జిల్లాలోనే తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో ప్రారంభించడం ఎంతో గర్వకారణమని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రైతులు పండించే ధాన్యానికి కనీస గిట్టుబాటు ధర లేక ఆర్‌బికెల ద్వారా సేకరించిన ధాన్యానికి తిరిగి రైతులకు ఎప్పుడు డబ్బులు పడతాయో తెలియక రైతులు ఆందోళన చెందేవారని, జగన్ ప్రభుత్వం పోతూపోతూ రాష్ట్రంలోని రైతులను నిండా ముంచేయాలనే దురుద్దేశంతో ధాన్యాన్ని సేకరించి, దాదాపు రూ.864 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లిపోయారని ఎంఎల్ఏ చింతమనేని తెలిపారు. రైతులకు అండగా నిలబడటమే లక్ష్యంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగన్ ఎగ్గొట్టిన రూ.864 కోట్ల బకాయిలను సైతం సత్వరమే మంజూరు చేయించి ఇవ్వడమే కాకుండా, ఈనాడు ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల లోపే రైతులకు ధాన్యం బకాయిలు సైతం నేరుగా వాళ్ల అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని, కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని దీని ద్వారా మరోసారి రుజువైందని చింతమనేని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ ఉపసంచాలకులు హబీబ్ భాషా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే రైతులకు గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రూ.864 కోట్ల చెల్లింపులో కీలక పాత్ర ఎంఎల్ఏ పోషించారని అన్నారు. తాను జిల్లా వ్యవసాయ శాఖ ఉప సంచాలకులుగా వచ్చినప్పుడు రైతులకు ధాన్యం బకాయిలు ఎంత ఉందని దెందులూరు ఎంఎల్ఏ ప్రశ్నించగా తాను జిల్లా నివేదిక చెప్పబోయానని, అయితే కేవలం జిల్లా మాత్రమే కాదని, అసలు రాష్ట్రంలో ఎంతమంది రైతులు ఈ విధంగా బకాయిలు రాక ఇబ్బందులు పడుతున్నారంటూ ఆ గణాంకాల నివేదికలు అడిగి తెలుసుకున్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 864 కోట్ల రూపాయలు రైతులకు బకాయిలు ఉన్నాయని తెలుపగా వెంటనే ఆయనతోపాటు తనను కారులో తీసుకొని వెళ్లి పౌర సరఫరాల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీరపాండ్యన్‌తో ఈ విషయంపై చర్చించారని, అదే విధంగా రైతులకు బకాయిలు సత్వరమే విడుదల కావాలనే లక్ష్యంతో మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కూడా ఈ అంశంపై మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చేయడంలో చింతమనేని ప్రభాకర్ ఎంతో కృషిచేశారని తెలియజేశారు. కార్యక్రమంలో పెదవేగి మండల అధ్యక్షులు బొప్పన సుధా, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, కమ్మ శివరామకృష్ణ, వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు వై.సుబ్బారావు, మండల రెవెన్యూ అధికారి భ్రమరాంబ, ఎంపిడిఒ శ్రీనివాసరావు సహా పలువురు కూటమి నాయకులు, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఏ చింతమనేని

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన కొవ్వలి సావిత్రి సుమారు ఐదు సంవత్సరాల నుంచి తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. ఈవిషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు చిలుకూరి సాయి బాబా, మోరపాకల రాధాకృష్ణ సింగపూర్‌కు చెందిన చేయూత సంస్థకు సిఫార్సు చేయగా వారు రూ.15 వేలు కొయ్యలగూడెం బ్రాహ్మణ యువశక్తి సంఘం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ యువశక్తి అధ్యక్షులు గోదావరి శ్రీనివాస్ శర్మ, కార్యదర్శి బొల్లాప్రగడ ప్రసాద్, ఉపాధ్యక్షులు మామిళ్ళపల్లి దుర్గా సీతారాం, కోశాధికారి ఆచంట రవి, గౌరవాధ్యక్షులు చెట్లపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

7, 8 తేదీల్లో అంతర్జాతీయ వర్క్‌షాప్

చింతలపూడి : ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసి), హెల్త్ ఇన్‌ఫెక్షన్ కమిటీ సంయుక్తంగా ఈనెల 7, 8 తేదీలలో చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఆరోగ్యకరమైన యువతను శక్తివంతం చేయడం' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు అన్నారు. చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్ఏ సొంగా రోషన్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం బ్రోచర్‌ను చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం 2025 ఆరోగ్యకరమైన యువతను శక్తివంతం చేయడం అనే అంశంతో జరుపుకుంటున్నారని తెలిపారు. యువత ఎదుర్కొంటున్న కీలకమైన ఆరోగ్య సవాళ్లపై అవగాహన కల్పించడం, మానసిక శ్రేయస్సు, ఫిట్‌నెస్, పోషకాహారంపై అవగాహన పెంచడం, డిజిటల్ ఆరోగ్య అలవాట్లను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశ్యాలని తెలిపారు.

స్వయం సోపానం రుణాలకు 566 మంది హాజరు

ఆగిరిపల్లి: వెనుకబడిన స్వయం ఉపాధి పథకం(బిసి, ఇబిసి కార్పొరేషన్) ద్వారా అందించే పథకాలను అర్హులైన లబ్ధిదారులు వినియోగించుకోవాలని బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పుష్పలత కోరారు. శుక్రవారం ఆగిరిపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద బిసి, ఇబిసి కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నిర్వహించిన ఇంటర్వ్యూలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ బి.ఆనంద్‌బాబు మాట్లాడుతూ మండల పరిధిలో రుణాలకు 732 మంది దరఖాస్తు చేసుకోగా శుక్రవారం 6 బ్యాంకులకు సంబంధించిన మేనేజర్లు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 566 మంది హాజరు అయ్యారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆర్‌టిసి బస్సులో గుండెపోటుతో వ్యక్తి మృతి

టి.నరసాపురం : ఏపిఎస్ ఆర్‌టిసి బస్సులో గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని రాజుపోతేపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కె.జగ్గవరం గ్రామానికి చెందిన కొమ్మన సోమేశ్వరరావు(60) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం తన భార్యను వెంటబెట్టుకొని జగ్గవరం నుంచి ఏలూరు డిపోకు చెందిన ఏపిఎస్ ఆర్‌టిసి ఎపి 16 జెడ్ 0031 బస్సులో హాస్పటల్‌కి బయలుదేరారు. మార్గమధ్యంలో రాజు పోతేపల్లి సెంటర్ వద్దకు వచ్చిన తర్వాత ఒక్కసారిగా గుండెపోటు రావడంతో బస్సులో అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ముసునూరు : మండలంలో అనుమానాస్పదంగా వ్యక్తి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి చెందిన పెంగుల ఏసుబాబు(48) సంవత్సర కాలం నుండి గుడిపాడు గ్రామంలో నెక్కలగంటి సత్యనారాయణ వద్ద పెద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 9 గంటలకు సదరు సత్యనారాయణ పామాయిల్ తోటలో ఏసుబాబు మృతిచెంది ఉన్నాడు. ఆయన మృతిపై కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

ఏలూరు స్పోర్ట్స్ : ఓవైపు అప్పులు, మరోవైపు కుటుంబాన్ని గడపలేని పరిస్థితులు ఆమెను బాగా కృంగ దీశాయి. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఎలుకలమందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన ఏలూరు నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఏలూరు ఒకటో పట్టణ ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని గొల్లాయిగూడెం ప్రాంతానికి చెందిన పరస మనీష(46) స్థానికంగా భర్తతో కలిసి హనుమాన్ నగర్ ప్రాంతంలో ఓ బడ్డీ కొట్టు నిర్వహిస్తుంది. ఈమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇద్దరికీ వివాహాలు జరిగాయి. కుమారుడు మాత్రం ఏ పని చేయకుండా వీరితో కలిసి జీవిస్తున్నాడు. ఈక్రమంలో కొట్టులో వ్యాపారం సరిగా లేక ఇల్లు గడవక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో అప్పులు చేశారు. ఓవైపు అప్పులు తీర్చలేని బాధ, మరోవైపు కుమారుడు ఏ పని చేయకుండా ఉంటున్నాడని అన్ని సమస్యలు కలిచివేశాయి. దీంతో ఈనెల 30వ తేదీన ఇంటి వద్దనే ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజనాస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈ ఘటనపై ఏలూరు ఒకటో పట్టణ ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రక్ ఆటో బోల్తా

చింతలపూడి : కూలీలతో వెళ్తున్న టాటా ట్రక్ ఆటో బోల్తా పడి పెను ప్రమాదం తప్పి స్వల్ప గాయాలతో బయట పడ్డ సంఘటన స్థానికంగా చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సరిహద్దు రాష్ట్రమైన తెలంగాణలోని దిద్దుపూడి గ్రామానికి చెందిన కూలీలు మండలంలోని వెలగలపల్లిలో మొక్కజొన్న ఫ్యాక్టరీలో రాత్రివేళ పనికి వెళ్లి ట్రక్ ఆటోలో తిరిగి వస్తుండగా శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో అంబేద్కర్ నగర్ వద్ద అదుపుతప్పి బోల్తా పడటంతో 10 మంది మహిళా కూలీలకు గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్ ద్వారా చింతలపూడి ఏరియా హాస్పిటల్‌కి తీసుకువెళ్లినట్లు తెలిపారు. వెంటనే ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు అప్రమత్తమై వైద్యం అందించిన తరువాత కసిరెడ్డి లక్ష్మి అనే మహిళకు మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించడం జరిగినట్లు తెలిపారు. కొందరు ఆటో డ్రైవర్ నిద్రలోకి వెళ్లడం వల్లనే ప్రమాదం జరిగిందని, మరి కొందరు ఆటో పంచర్ అవ్వడం వల్ల ప్రమాదం జరిగిందని తెలిపారు. ఆటోలో దాదాపుగా 15 మంది ఉన్నారని, వృద్ధులు కూడా ఉండటంతో భయాందోళనతో అరుపులు, కేకలు వేశారు. హాస్పిటల్‌లో వైద్యం తీసుకుంటున్న వారి వద్ద నుంచి చింతలపూడి ఎస్ఐ కుటుంబసభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జరిగిన సంఘటనపై చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్ఏ సొంగా రోషన్‌కుమార్ ఆరా తీశారు. ప్రమాదం ఎలా జరిగిందని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ దేవాని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మిగతా క్షతగాత్రులంతా క్షేమంగానే ఉన్నారని హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

అప్పు ఆలస్యంగా చెల్లించినందుకు..

ముదినేపల్లి : కిరాణా కొట్టులో అప్పు తీసుకుని అప్పు ఆలస్యంగా చెల్లించిన వ్యక్తిపై వ్యాపారి దాడి చేసి కొట్టినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముదినేపల్లికి చెందిన ఈడే పెద్దేశ్వరరావు సమీపంలో ఉన్న కిరాణా కొట్టు నిర్వహిస్తున్న గూడవల్లి కోటయ్య, జగదాంబ కిరాణా కొట్టులో రూ.1,750 సరుకులు అప్పుచేసి సకాలంలో చెల్లించలేదు. ఆలస్యంగా రెండు దఫాలుగా పెద్దేశ్వరరావు వ్యాపారికి చెల్లించాడు. అప్పు లేటుగా ఇచ్చినందుకు జగదాంబ పెద్దేశ్వరరావుపై కేకలు వేయగా ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో జగదాంబ తనను కొట్టినట్లు పెద్దేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడి వ్యర్థాలను చేపల చెరువులకు వేసేందుకు యత్నం..

భీమడోలు : భీమడోలు రెవెన్యూ పరిధిలోని లింగంపాడు ఆవాస ప్రాంతంలోని చేపల చెరువుకు నిషేధిత కోడి వ్యర్థాలను మేతగా తరలించి, దానిని చెరువులో కలిపే ప్రయత్నంలో ఉండగా భీమడోలు పోలీసులు ముందస్తు సమాచారంతో వాహనంపై ప్రత్యేక దాడి చేశారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కోడి వ్యర్థాల రవాణాకు వినియోగించిన మోటార్ వాహనాన్ని స్వాధీనపరచుకున్నారు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెదపాడు మండలం కొత్తూరు ప్రకాష్, కూరపాటి పాపారావు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కోళ్ల వ్యర్థాలను సేకరిస్తున్నారు. దీనిని చేపల మేతగా అందజేసేందుకు భీమడోలు చేరుకున్నారు. లింగంపాడు ఆవాస ప్రాంతంలోని గంట మోహన్ రాజుకు సంబంధించిన చేపల చెరువులో వారు కోడి వ్యర్థాలను చేపల మేతగా వదిలేందుకు సిద్ధమవ్వగా నిందితులను ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కేసును భీమడోలు ఎస్ఐ సుధాకర్ దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.అజయ్ కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దళిత కుటుంబంలో జన్మించి, ఉన్నత విద్యాభ్యాసం ద్వారా అత్యున్నత స్థానానికి చేరుకోవడం ద్వారా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. అనంతరం పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు టి.వెంకట దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రిగా హరిత విప్లవానికి నాంది పలుకుతూ భారతదేశం ఆహార గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించడానికి దోహదపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు డాక్టర్ ఎం.రాంబాబు, వి.వెంకట్రావు, ఎస్.పరమేశ, డాక్టర్ ఎం.విజయ కుమార్, డాక్టర్ పిఆర్.కావ్యశ్రీ, ఎస్.సుస్యలత, డి.సుజాత పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షురాలిగా గీతాంజలి

భీమడోలు : భీమడోలు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షురాలిగా కె.గీతాంజలి ఎంపికయ్యారు. భీమడోలు కోర్ట్ ఆవరణలో భీమడోలు బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు ఇంజేటి విజయ అచ్యుతం ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో నూతన అధ్యక్షురాలితో పాటు ఉపాధ్యక్షులుగా కె.మోహన శ్రీనివాసరావు(వాసు), ప్రధాన కార్యదర్శిగా ఎస్.గోపాలకృష్ణ(గోపి), కోశాధికారిగా ఇంజేటి విజయ అచ్యుతం, కార్యదర్శిగా ఎల్.సుధారాణి, లైబ్రరీ అండ్ స్టోర్స్ కార్యదర్శిగా లెనిన్, మహిళా ప్రతినిధిగా టి.రాణి ఎన్నికయ్యారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా ర్యాలీ

ముదినేపల్లి : మండలంలోని బొమ్మినంపాడులో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి గౌతమ్ కుమార్ పచ్చిరొట్ట పైర్లు పెంపకం ఉపయోగాలు, పెరటితోటల పెంపకం, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తుల గూర్చి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండవల్లి ప్రకృతి వ్యవసాయ ఇన్‌ఛార్జి నాగవిజయ, విఏఎ పావని, స్కూల్ హెచ్‌ఎం బేతాళరావు, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, సిబ్బంది విజయలక్ష్మీ, సునీత, ఐసిఆర్‌పిలు అనూష, సుధాకర్, నళిని, జగన్, విద్యార్థులు పాల్గొన్నారు.

తహశీల్దార్ సుభాని బదిలీ

ముదినేపల్లి : మండల తహశీల్దార్ జెఎస్.సుభాని రాష్ట్ర సచివాలయానికి బదిలీపై వెళ్లారు. సుభాని సాధారణ ఎన్నికల తర్వాత మండవల్లి మండలం నుంచి బదిలీపై ముదినేపల్లి వచ్చారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి బాధ్యతలను డిప్యూటీ తహశీల్దార్ పవన్‌కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి విఆర్‌ఒలు తహశీల్దార్ సుభానికి వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

దెందులూరు : ఉండ్రాజవరం కమ్యూనిటీ హాల్లో రామేడ పైదారావు ప్రభావతి జ్ఞాపకార్థం ఈనెల 6న ఆర్థోపెడిక్ వైద్యాధికారి హరికృష్ణ, గైనకాలజీ వైద్యాధికారి గీతిక, వైద్య సిబ్బందితో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, పరీక్షలు చేసి మందులు అందజేస్తామని గుండుగొలను రిటైర్డ్ గ్రంథాలయాధికారి బెజవాడ ప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని, ఉండ్రాజవరంతోపాటు సమీప గ్రామాల్లో ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని బెజవాడ ప్రసాద్ కోరారు.

ఆటోలకు ఎల్ఇడి లైట్లు తొలగింపు

ఏలూరు స్పోర్ట్స్ : ఆటోలకు ఎల్ఇడి లైట్లు బిగించడం ద్వారా ఎదుటి వాహన అధికారులకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో ఈ ఎల్ఇడి లైట్లు ఆటోలకు తొలగించే ప్రక్రియలో భాగంగా ఆటోలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని ఏలూరు ఉప రవాణా కమిషనర్ కార్యాలయ ఎన్ఫోర్స్‌మెంట్ రవాణా అధికారి రమేష్ అన్నారు. ఏలూరు నగరంలోని చోదిమళ్ల జాతీయ రహదారి వద్ద శుక్రవారం సాయంత్రం ఎల్ఇడి లైట్లు ఆటోలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎల్ఇడి లైట్లు బిగించి, ఆటోలు నడపడం ద్వారా ఆటోడ్రైవర్లకు వెలుతురు బాగానే వస్తుందని, ఈ ఎల్ఇడి లైట్లు వెలుతురు వల్ల ఎదురు వచ్చే వాహనదారులు దారి కనిపించక ఇబ్బందులు పడుతున్నారని, దీంతో ఈ లైట్లు దాదాపు 50 ఆటోలకు తొలగించామన్నారు. ఈ సందర్భంగా రవాణా అధికారి రమేష్ మాట్లాడుతూ దాదాపు 50 ఆటోలకు ఎల్ఇడి లైట్లు తొలగించామని తెలిపారు. మరోమారు ఎల్ఇడి లైట్లు బిగించినట్లయితే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలియజేశారు. ఈ డ్రైవ్‌లో వాహన తనిఖీ అధికారులు నరేంద్ర బాబు, జగదీష్ బాబు, నెహ్రూ, ప్రజ్ఞ పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్లకు శిక్షణ

పోలవరం : డ్వాక్రా సంఘాల సభ్యులకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల జీవనోపాదులు పెంపొందించుటకు ఆర్థికపరమైన సహకారం సంఘాల ద్వారా అందించి, సభ్యురాలికి ఏ అవసరానికి ఏ నెలలో ఎంత సొమ్ము అవసరమై ఉంటుందనే విషయాలు తెలుసుకొనుటకు ఈ ఆర్థిక సంవత్సరంలో క్రెడిట్ అండ్ లైవ్ హుడ్స్ యాక్షన్ ప్లాన్ అనేది ప్రభుత్వం(సెర్ప్) ద్వారా రూపొందించడం జరిగిందని ఎపిఎం జేమ్స్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమాచారాన్ని యాప్ ద్వారా చేయుటకు ప్రతి గ్రామ సంఘం నుంచి 6 నుంచి 8 సంఘాల వరకు ఒక ఎన్యూమరేటర్‌ను గుర్తించడం జరిగింది. వీరికి మండల కేంద్రంలోని స్థానిక వెలుగు కార్యాలయం(శ్రీ శక్తి భవనం)లో ఈనెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకూ శిక్షణ నిర్వహించినట్లు ఎపిఎం జేమ్స్ తెలియజేశారు. ఈ శిక్షణలో సిసిలు నిర్మలాకుమారి, రమాదేవి, విఏఎలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జిల్లా మలేరియా అధికారి పివిఎస్ఎస్.ప్రసాద్

ఏలూరు సిటీ : అపరిశుభ్ర పరిసరాలే అంటువ్యాధులకు కారణం కాబట్టి ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించి అంటువ్యాధులకు దూరంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి పివిఎస్ఎస్.ప్రసాద్ సూచించారు. ఏలూరులోని ఆమదాల అప్పలస్వామి కాలనీలో పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ఫ్రైడే డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పివిఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఒక చిన్న దోమకాటు ద్వారా అనేక ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చేసే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలకు హానిచేసే దోమలైన డెంగీ, మలేరియా మన గృహాల్లో ఉండే మంచినీటి నిల్వ ప్రాంతాలలో పెరుగుతాయని, ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించాలని, డెంగీ, మలేరియా పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల రక్త, మూత్ర పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు వేసవికాలంలో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేల్ హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మలేరియా అధికారి ప్రసాద్

అధికారులు రాకపోవడం బాధాకరం

ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్

మండవల్లి : ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహించే కార్యక్రమాలకు అధికారులు పాల్గొనకపోవడం బాధాకరమని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన శుక్రవారం రెండు గంటలకు సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎక్కువ మంది అధికారులు హాజరు కాకపోవడంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఎంపిటిసి, సర్పంచ్లు మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి నిర్వహించుకున్న సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడం బాధాకరమని అన్నారు. గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునే విధంగా నిర్వహించే సమావేశానికి అధికారులు రాకుండా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను కొంతమంది అధికారులు చిన్నచూపు చూస్తూ కావాలనే సమావేశానికి రావడం లేదని, సమావేశానికి హాజరుకాని వారిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపిపిని కోరారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరుకాకపోవడం విచారకరమన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం వ్యవసాయ, ఐసిడిఎస్, ఆరోగ్య, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, గృహనిర్మాణ, మహాత్మా గాంధీ, ఉపాధి హామీ చట్టం తదితర శాఖలు ప్రజలకు అందించే సేవల గురించి తెలియజేసి అనంతరం సమావేశం ముగించారు. జెడ్‌పిటిసి సభ్యురాలు ముంగర విజయనిర్మల, వైస్ ఎంపిపిలు అగస్తి ఆదివిష్ణు, చాటగడ్డ నాగరాణి, ఎంపిడిఒ నాగమల్లేశ్వరరావు, ఇఒపిఆర్‌డి శేఖర్ పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటిలో 'పవర్ విజన్-2050, ఎనర్జీ ఇంజనీరింగ్'

నూజివీడు టౌన్ : ఆర్‌జియుకెటి నూజివీడులో శుక్రవారం విద్యార్థులకు తమ విద్యా, నైపుణ్యాలను మెరుగుపరచడానికి రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం, నూజివీడు ఇఇఇ డిపార్ట్మెంట్ ఆధ్వర్యాన 'పవర్ విజన్ 2050, ఎనర్జీ ఇంజనీరింగ్' అనే అంశంపై కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీనియర్ జనరల్ మేనేజర్ కె.నాగమోహన్ రావు ప్రస్తుత భారతదేశంలోని విద్యుత్ రంగం-భవిష్యత్తు మీద ఆయన విలువైన అభిప్రాయాలను విద్యార్థులకు అందించారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్(ఇఇఇ) మూడోవ సంవత్సరం విద్యార్థులంతా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు భారతదేశం విద్యుత్ రంగం గురించి అవగాహన పెంచడానికి, అలాగే దేశ విద్యుత్ శక్తి రంగంలో మార్పులు, అభివృద్ధి, కొత్త అవకాశాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా పవర్ విజన్-2050 అనే చారిత్రక అంశం గురించి వివరించారు. ఇది భారతదేశం విద్యుత్ శక్తి రంగాన్ని 2050 నాటికి మరింత స్థిరమైన, సమర్థవంతమైన, వినియోగదారులకు అనుకూలమైన రంగంగా మారనుందని తెలిపారు. నాగమోహన్ రావు, విద్యుత్ రంగంలో తన అనుభవాన్ని పంచుకుంటూ పవర్ విజన్-2050 ముఖ్య ఉద్దేశాలను వివరించారు. అనంతరం ఇఇఇ విభాగాధిపతి శ్రావణి కనక కుమారి మాట్లాడుతూ ఇది విద్యార్థులకు పరిశ్రమ నిపుణులతో పరిచయం కల్పించే ప్రయత్నమని అన్నారు. తద్వారా విద్యార్థులు తమ విద్యా ఆవకాశాలను పరిశ్రమ అవసరాలతో సరిపోల్చుకోగలుగుతారని అన్నారు. ఈవిధంగా ఇఇఇ విభాగం తమ విద్యార్థులకు, వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి అవసరమైన పరిజ్ఞానం అందించడానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఇఇ విభాగాధిపతి శ్రావణి కనక కుమారి, కోఆర్డినేటర్ డాక్టర్ బి.జ్యోతిలాల్ నాయక్, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ బి.శ్రీనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా న్యూ కీర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడు గ్రామంలోని న్యూ కీర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 14వ వార్షికోత్సవం విద్యార్థులు తల్లిదండ్రులతో ఎంతో ఉత్సాహంగా శుక్రవారం సాయంత్రం జరిగింది. విద్యార్థులు వివిధ రకాల డాన్సులు, పాటలతో, కోలాటాలు, వేషాలతో అలరించారు. ఈ స్కూల్ కరస్పాండెంట్ నల్లూరి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ వారి స్కూల్ 14వ వార్షికోత్సవం విద్యార్థులతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

టాలెంట్ పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

చింతలపూడి: శ్రీ చైతన్య విద్యార్థులు ఐఎన్‌టిఎస్ఒ టాలెంట్ పరీక్ష సెకండ్ లెవెల్‌లో విశిష్ట ప్రతిభ కనపరిచారని పాఠశాల ప్రిన్సిపల్ టి.సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులలో 249 మంది వివిధ విభాగాల్లో అత్యున్నత ప్రతిభ కనపరచారని, దానిలో భాగంగా ఒకరు మొదటి బహుమతి సయ్యద్ జోయా మాన్యా, ఇద్దరు రెండవ బహుమతి, ముగ్గురు మూడవ బహుమతి, నలుగురు నాలుగవ బహుమతి, నలుగురు ఐదవ బహుమతి, 8 మంది స్పెషల్ ప్రైజ్‌ను, 93 మంది కన్సోలేషన్ బహుమతి, 26 మంది గోల్డ్ మెడల్, 108 మంది గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ సాధించి విజయకేతనం ఎగరవేశారని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ శ్రీ చైతన్యలో అందించే ప్రత్యేక శిక్షణ వల్ల మాత్రమే విద్యార్థులు ఇంతటి ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. చివరిగా బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. శ్రీచైతన్య స్కూల్స్ ఎజిఎం పార్థసారథి, ఆర్ఐ ఉదయభాస్కర్, కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం సురేష్, ఎఒ రవీంద్ర, డీన్ మధు బాబు, ప్రైమరీ ఇన్‌ఛార్జి ఝాన్సీ పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులు

వంతెన నిర్మాణానికి కృషి : ఎంపీ

ఏలూరు సిటీ : ప్రభుత్వ శాఖల నడుమ కొరవడిన సమన్వయలోపంతో భీమడోలు మండలం గుండుగొలను వద్ద ఏలూరు కాలువపై అసంపూర్తిగా నిలిచిన వంతెన నిర్మాణ పనులు కొలిక్కి తీసుకువచ్చే దిశగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టి సారించారు. భీమడోలు మండలం గుండుగొలను వైపు వెళ్లే ప్రజలు వ్యతిరేక దిశలో జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తూ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో గుండుగొలను వద్ద ఏలూరు కాలవపై వంతెన నిర్మాణానికి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రూ.3.40 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ అనంతరం నిర్మాణ పనుల బాధ్యతలు స్వీకరించిన గుత్తేదారు వంతెన నిర్మాణం ప్రారంభించారు. అయితే ఏలూరు కాలవపై అనుమతి తీసుకోకుండా, తమ శాఖ మార్గదర్శకాల మేరకు వంతెన నిర్మాణం చేపట్టనందున తక్షణం పనులు నిలిపివేయాలని ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఫలితంగా స్లాబ్ దశ వరకు చేరిన వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచాయి. దీంతో స్థానిక ప్రజలు, నాయకులు సమస్యను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీ ఆదేశాలతో ఎన్‌హెచ్ఎఐ టెక్నికల్ మేనేజర్ సాల్మన్ అన్సోవి, సైట్ ఇంజనీర్ సాయినాథ్, కన్స్ట్రక్టివ్ మేనేజర్ సోమేశ్, ఐడబ్ల్యూఎఐ విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ సురేష్ శర్మ, జూనియర్ ఇంజనీర్ ఆర్.లోకేష్, ఒఎస్‌డి రాఘవులు, స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి ఏలూరు కాలువపై నిలిచిన వంతెన నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. వంతెన నిర్మాణానికి అనుమతి కోరుతానని ఎంపీ స్థానిక ప్రజలుకు హామీ ఇచ్చారు.

ముళ్ల కంపల తొలగింపునకు శ్రీకారం

మండవల్లి : దట్టంగా పెరిగిపోయిన ముళ్ల కంపల తొలగింపుకు పంచాయతీ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టామని సర్పంచి మండా ఝాన్సీ స్పష్టం చేశారు. హిందూ శ్మశాన వాటికలో జెసిబితో చేపట్టిన ముళ్ల కంపల తొలగింపు పనులను ఆమె వార్డు మెంబర్లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూ శ్మశాన వాటికకు వెళ్లే రహదారి వెంబడి ముళ్ల కంపలు బాగా దట్టంగా పెరిగిపోయాయి. అంతిమ సంస్కారాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని, ముళ్ల కంపలు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు పంచాయతీ దృష్టికి తీసుకు వచ్చారని అన్నారు. దీంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించే విధంగా జెసిబిని ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో ముళ్లకంపలు తొలగించే విధంగా చర్యలు చేపట్టామని అన్నారు. అంతేకాకుండా మండవల్లి ఎస్‌సి శ్మశానం 1, 2లతోపాటు కుమ్మరి శ్మశానంలో కూడా ముళ్లకొంపలు తొలగించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఆగొండ్ల సత్యనారాయణ, అడపా జాన్ బాబు, పసుపులేటి నాంచారయ్య, మెండ సురేష్ పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై గ్రామసభ

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల గ్రామంలోని పంచాయతీ ఆఫీస్ వద్ద శుక్రవారం ఉదయం రీ సర్వే ప్రాజెక్ట్ గ్రామసభ నిర్వహించారు. ద్వారకాతిరుమల గ్రామం, కొమ్ముగూడెంలో ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమం జరుగుతుందని, 104 రోజులపాటు ఈ రీసర్వే రైతుల సమక్షంలో జరుగుతుందని, ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతుల సమస్యలు పరిష్కరించి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తామని తహశీల్దార్ తెలిపారు. ముందుగా ద్వారకాతిరుమల కొమ్ముగూడెం గ్రామాలకు సరిహద్దు బౌండరీలు నిర్ణయిస్తామని, తదుపరి ప్రభుత్వ భూములు గుర్తించి చెరువులు, పోరంబోకు స్థలాల ఆక్రమణలు సర్వే చేసి నివేదికలు తయారు చేస్తామని తహశీల్దార్ జెవి.సుబ్బారావు తెలిపారు.

డ్వాక్రా మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ఐటిడిఎ పిఒ రాములు నాయక్

జీలుగుమిల్లి : డ్వాక్రా మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషిచేస్తుందని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రాములు నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కామయ్య పాలెం, జిల్లెల్లగూడెంలో ఏర్పాటు చేసిన వన్ దన్ వికాస కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో తయారవుతున్న కారం, చింతపండును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎపిడి రాజబాబు, ఎపిఎం ఝాన్సీ, సిసిలు అరుణ, బోస్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మొవ్వ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్. 58/2022

బిట్వీన్:
బొందలపాటి ఉదయవాణి అనే కోనేరు ఉదయవాణి భర్త : లేటు కోనేరు సత్యనారాయణ, రామానగరం, లక్ష్మీపురం, చల్లపల్లి మండలం ....వాది
బొందలపాటి ప్రియాంక @ కోనేరు ప్రియాంక, భర్త: బండారుపల్లి స్వామి, ఎంప్లాయ్, మునుగుంట నాగన్నగారి వీధి, ఉండిరోడ్డు, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా. .... ప్రతివాది

పై నెంబరు దావాలో వాది ప్రతివాదిపై దావా షెడ్యూలు దాఖలా ఆస్తిపై పర్మినెంట్ ఇంజెక్షన్ దావా దాఖలు చేయగా, సదరు దావాలో ప్రతివాదికి దావా నోటీసు నిమిత్తం ది.24-4-2025న వాయిదా అయివున్నది. కావున సదరు ప్రతివాది ఆరోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలియపరచుకొన వలెను. లేనియెడల పరోక్షంగా తీర్మానించబడును.

వల్లభనేని రామారావు, ఎం.కాం. ఎల్.ఎల్.బి.,
కొడాలి మురళీ,
వాది తరపు అడ్వకేట్స్, మొవ్వ, మొవ్వ మండలం.

Public Notice
Before The Principal Senior Civil Judge, Eluru, W.G.Dt
O.S.No. 72/2024

Between:
Vadlapatla Vimala Devi ...Plaintiff
And
Nunna Srilakshmi & ors ...Defendants

To:
D7-Mareedu Kondala Rao,
S/o Mareedu Rama Sastrulu,
D.No. 1-143, Satrampadu,
Eluru, Eluru District.

Whereas, the plaintiff has filed suit for recovery of the amount due under the suit mortgage, whereas the Hon`ble Court ordered notice to you and posted the matter for your appearance. Therefore, you are called upon to appear before the Hon`ble Court on 08-04-25 at 10-30 A.M., and state your objections if any, else the matter will be decided in your absence.

PYDI VENKATA RAJU
Eluru — Advocate,
Dt. 04-04-2025 — Eluru.
Cell: 98851 99811

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. No. 24/2024 in
O.S. No. 240/2021

Between:
బూరాబత్తుల శ్రీనివాసరావు ...పిటీషనరు/డిక్రీ హోల్డర్
And
1. పాలా శ్రీనివాసరావు @ శ్రీనివాస్
2. పాలా ఝాన్సీ ...రెస్పాండెంటు/జడ్జిమెంట్ డేటర్

To:
R-1: 1. పాలా శ్రీనివాసరావు @ శ్రీనివాస్, తండ్రి: వెంకటరావు, వయస్సు 47 సం॥, పురుషుడు, వ్యాపారం, డోర్ నెంబర్ 10-109/1, అంబటివానిచెరువు, H/o పోడూరు, పోడూరు మండలం.

పై నెంబరు పిటిషనులో 1వ రెస్పాండెంటు/1వ జడ్జిమెంట్ డేటర్ హాజరు నిమిత్తం **ది.23-04-2025 సం.తేదికి** వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10-30 ని॥లకు** స్వయముగా కానీ, న్యాయవాది గారి ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పిటిషను ముందు గ్రంధము జరుపబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
పాలకొల్లు — న్యాయవాది
తేది:27-03-2025 — పాలకొల్లు
పశ్చిమ గోదావరి జిల్లా